ఘనంగా మహాలక్ష్మీ బోనాల పండుగ

గుండారంలో వలగొడుగుతో ఊరేగింపు నిర్వహిస్తున్న గ్రామస్తులు

సారంగాపూర్/ ఇందల్వాయి/ సుభాష్‌నగర్, అక్టోబర్ 20 : రూరల్ మండలంలోని గుండారం, మల్కాపూర్ (ఏ), గూపన్‌పల్లి, ఖానాపూర్ గ్రామాల్లో మహాలక్ష్మీ (ఖుషీ) పండుగను ఆదివారం నిర్వహించారు. పంటలు బాగా పండాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుతూ మహిళలు బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. గుండారంలో గంగపుత్ర సంఘం సభ్యులు వలగొడుగుతో డప్పువాయిద్యాల మధ్య బోనాల ఊరేగింపు నిర్వహించారు. ఇందల్వాయి మండలం సిర్నాపల్లిలో ఊరపండుగ నిర్వహించారు. గ్రామదేవతల విగ్రహాలను ఊరేగించి, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. నగరంలోని వినాయక్‌నగర్, కంఠేశ్వర్‌లో నిర్వహించిన మహాలక్ష్మీ అమ్మవారి బోనాల ఊరేగింపులో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పాల్గొని, పూజలు చేశారు.

యాసిడ్ తాగిన హోంగార్డు మృతి

చిన్నయ్య(ఫైల్)

వినాయక్‌నగర్, అక్టోబర్ 20 : నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో హోంగార్డు విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న చిన్నయ్య(39) నాలుగురోజులుగా జిల్లా దవాఖానలో చికిత్స పొందుతూ ఆదివారం మరణించాడు. చిన్నయ్య ఈ నెల 16న తన ఇంట్లో యాసిడ్ తాగడంతో కుటుంబీకులు చికిత్స కోసం జిల్లా దవాఖానలో చేర్పించారు. పరిస్థితి విషమించి మృతిచెందాడు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఆర్‌టోన్ పోలీసులు తెలిపారు.

జిల్లాస్థాయి కవితా రచన పోటీలు

సుభాష్‌నగర్, అక్టోబర్ 20 : బాలబాలికల్లో భాష ఆసక్తి, సృజనాత్మకతను పెంపొందించడానికి ఇందూరు జిల్లా బాల సాహిత్య వేదిక కృషి చేస్తున్నదని అధ్యక్షుడు కాసర్ల నరేశ్‌రావు అన్నారు. నగరంలోని సీతారాంనగర్ కాలనీలో బాలసాహిత్య వేదిక కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. నవంబర్‌లో బాలల దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి కవితా రచన పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 'నేను నా బాల్యం' అంశంపై 6 నుంచి 12వ తరగతి విద్యార్థులు కవితలు రాసి, 9441406252 నంబర్‌కు వాట్సాప్ చేయాలని సూచించారు. సమావేశంలో మహిళా కార్యదర్శి శారదాహన్మాండ్లు, కోశాధికారి చింతల శ్రీనివాస్‌గుప్తా, కార్యదర్శులు కందకుర్తి ఆనంద్, చంద్రశేఖర్ శర్మ, రమణాచారి, ధనుంజయ పాల్గొన్నారు.

నిజాం షుగర్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- ఎమ్మెల్సీ కోదండరామ్‌కు నిజాం చక్కెర ఫ్యాక్టరీ కార్మిక సంఘం నాయకుల వినతి

కోదండరామ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

శక్కర్‌నగర్, అక్టోబర్ 20: నిజామాబాద్ పట్టణంలోని టీఎన్జీవో భవనంలో ఆదివారం బోధన్ ఎన్డీఎస్ఎల్ కార్మిక సంఘం నాయకులు ఎమ్మెల్సీ కోదండరామ్‌ను కలిసి కార్మికుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. నిజాంచక్కెర కర్మాగారాన్ని ప్రభుత్వం ప్రకటించిన విధంగా వెంటనే తెరిపించాలని, కార్మికులకు రావాల్సిన బకాయి వేతనాలు ఇప్పించాలని, ఉద్యోగ విరమణ పొందిన కార్మికులకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించేలా ఏర్పాట్లు చేయాలని నాయకులు ఉపేంద్ర, రవిశంకర్ గౌడ్ కోదండరామ్‌కు విన్నవించారు. నిజాంషుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణలో భాగంగా కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, కార్మికుల గ్రాడ్యుటీ రూ.3.5 లక్షల నుంచి రూ. 20లక్షలకు పెంచి ఇప్పించాలని, ఈ విషయాలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి కార్మికులకు న్యాయం చేయాలని వారు కోరారు. కాగా, ఈ విషయాలపై కోదండరాం సానుకూలంగా స్పందించినట్లు కార్మిక సంఘం నాయకులు ఉపేందర్, రవిశంకర్ గౌడ్, పోల్కస్వామి, శ్రీధర్, సరిచంద్ తదితరులు తెలిపారు.

రుణం మాఫీకాదు - రైతుభరోసా రాదు

- ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి
- 'రైతుభరోసా' మోసంపై రైతులు, బీఆర్ఎస్ నాయకుల ఆగ్రహం
- మండలాల్లో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనాలు

డిచ్‌పల్లిలో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మాక్లూర్/ఆలూర్/ రుద్రూర్/ డిచ్‌పల్లి/ ఖిలీల్‌వాడి, అక్టోబర్ 20 : ఎన్నికల సమయంలో రైతుభరోసా పెంచి ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ నేతలు, పంట చేతికి వచ్చినా పెట్టుబడి సాయం ఇవ్వలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలోని వివిధ మండలాల్లో రాష్ట్ర ప్రభుత్వ, సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను ఆదివారం రైతులు, బీఆర్ఎస్ నాయకులు దహనం చేశారు.

రైతాంగానికి రుణమాఫీ కాదు-రైతు భరోసా రాదని ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మాక్లూర్ మండలం మానిక్‌బండార్ వద్ద కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మను బీఆర్ఎస్ ఆధ్వర్యంలో దహనం చేశారు. అనంతరం మాజీ జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావుతో కలిసి ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. హామీల అమలు విషయంలో రాష్ట్ర మంత్రులు, సీఎం తలో మాటా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన రూ.2 లక్షల రుణమాఫీ 20 నుంచి 30 శాతం మంది రైతులకే వచ్చిందని అన్నారు. వానకాలం రైతు భరోసా సాయం ఇవ్వకపోగా, ఇప్పుడు యాసంగి పంటకు కూడా ఇవ్వబోమని ప్రభుత్వం చేతులెత్తేసిందని అన్నారు. హామీలు అమలు చేసే వరకు రైతుల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆశన్నగారి రాజేశ్వర్‌రెడ్డి, మండల నాయకులు ప్రభాకర్, ఆకుల రజినీశ్, హైమద్, మహేశ్, భూషణ్, రంజిత్, సుమలత, సురేశ్ పాల్గొన్నారు.

ఆలూర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. రైతుభరోసా ఎకరానికి రూ.15,000 వెంటనే అందజేయాలని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో పలువురు రైతులు పంట పొలం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు.

రుద్రూర్‌లో కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ప్రజలంతాఅసంతృప్తిగా ఉన్నారని, ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గాండ్ల మధు, పోచయ్య, కొండల్‌వాడి సాయికిరణ్, పురుగయ్య, నీరడి సాయిలు పాల్గొన్నారు. డిచ్‌పల్లిలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బీఆర్ఎస్ నాయకులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. వనాకాలం సీజన్‌కు సంబంధించి రైతుభరోసా ఇవ్వలేమని అన్నందుకు మంత్రి తుమ్మల దిష్టిబొమ్మను దహనం చచేశారు. పభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీఆర్ఎస్ నాయకులు చింత మహేశ్, పద్మారావు, నల్లవెల్లి సాయిలు, ఒడ్డెం నర్సయ్య, హన్మంత్‌రెడ్డి, అక్బర్‌ఖాన్, దీకొండ శ్రీనివాస్, నడ్పన్న, తిరుపతి, సంజీవ్, రవికిరణ్, తాండ్ర అంజయ్య, సూదంనాయక్,నట్ట బోజన్న, మొచ్చ శ్రీనివాస్, మదుకర్, సంజయ్, సరిత, పడ్కల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా పిలుపు మేరకు జిల్లాకేంద్రంలోని ధర్నాచౌక్‌లో కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను బీఆర్ఎస్ నాయకులు దహనం చేశారు. జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, నుడా మాజీ చైర్మన్ చామకూర ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు సిర్ప రాజు తదితరులు మాట్లాడారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి అటకెక్కించారని ఎద్దేవా చేశారు. పంటలు కోతకు వచ్చినా పంట పెట్టబడి సాయం అందించకపోవడం సిగ్గుచేటన్నారు. రుణమాఫీ కూడా అర్హులందరికీ ఇవ్వకుండానే చేతులు దులుపుకొన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సత్యప్రకాశ్, సూదం రవిచందర్, దండు శేఖర్, ఎనుగందుల మురళి, జగత్‌రెడ్డి, పరమేశ్, నీలగిరి రాజు, మల్కాయి మహేందర్, గాండ్ల లింగం, చింతకాయల రాజు, విఠల్, మధుకర్‌రెడ్డి, సనాఉల్లా, గంగామణి పాల్గొన్నారు.



రుద్రూర్‌లో నిరసన వ్యక్తంచేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఆలూర్‌లోని పొలంలో నిరసన తెలుపుతున్న రైతులు

సంక్షిప్తంగా..

- **శ్రీ చౌడేశ్వరీ ఆలయంలో చీరల వేలం** - రుద్రూర్, అక్టోబర్ 20 : మండలకేంద్రంలోని శ్రీరామలింగ చౌడేశ్వరి మాత ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో శేధార్థి కార్యక్రమంతోపాటు అమ్మవారి చీరల వేలం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. దేవాంగ కులస్తులు, మహిళలు పాల్గొన్నారు.
- **గీత కార్మికుల సంఘ వార్షికోత్సవం** - కోటగిరి (పోతంగల్),అక్టోబర్ 20 : మండలంలో 67వ గీతా కార్మికుల సంఘం వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. గీత పని వారల సంఘం రాష్ట్ర కార్యదర్శి విఠల్‌గౌడ్ జెండా ఆవిష్కరించారు. 67 ఏండ్ల ప్రయాణంలో సాధించిన విజయాలు, సంఘం చేసిన కార్యక్రమాలను గుర్తుచేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు వెంకట్ గౌడ్, ప్రధానకార్యదర్శి శ్రీధర్ గౌడ్, ఉపాధ్యక్షులు నరేశ్‌గౌడ్, పండరిగౌడ్, గంగాధర్ గౌడ్, సాయాగౌడ్ పాల్గొన్నారు.
- **ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటు** - కోటగిరి (పోతంగల్), అక్టోబర్ 20 : బోధన్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని కొత్తపల్లిలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. కంచూపు లోపాలు ఉన్నవారికి ఆప్తాల్మిక్ అసిస్టెంట్ నేరెళ్ల సతీశ్ వైద్య పరీక్షలు నిర్వహించారు. 40 మంది రోగులను పరీక్షించి, 14 మందికి కంటి ఆపరేషన్ అవసరమని గుర్తించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ హనుమంతరావు, సిబ్బంది పాల్గొన్నారు.
- **ప్రభుత్వాలు రైతులకు ఇచ్చిన హామీలను అమలుపర్చాలి** - ఖిలీల్‌వాడి, అక్టోబర్ 20 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలు, రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలుపర్చాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోటేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. ఏఐకేఎంఎస్ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నగరంలోని ఎన్ఆర్ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.
- **పాలిటెక్నిక్ గ్రౌండ్‌లో వైద్యశిబిరం** - ఖిలీల్‌వాడి, అక్టోబర్ 20 : నగరంలోని పాలిటెక్నిక్ గ్రౌండ్‌లో అక్షిత ఫౌండేషన్, అపోలో డయాగ్నోస్టిక్ ఆధ్వర్యంలో ఆదివారంవైద్యశిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్లు వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సన్నికుమార్, థామస్, మహేశ్, ప్రమీల పాల్గొన్నారు.
- **నేడు బాధ్యతలు స్వీకరించనున్న టీయూ వీసీ** - డిచ్‌పల్లి, అక్టోబర్ 20 : టీయూ వైస్ చాన్స్‌లర్‌గా నియామకమైన ప్రొఫెసర్ డాక్టర్ యాదగిరిరావు సోమవారం పరిపాలనభవనంలో పదవీ బాధ్యతలు స్వీకరించనున్నట్లు రిజిస్ట్రార్ యాదగిరి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.
- **సమస్యలు పరిష్కరించాలని వర్సిటీ లెక్చరర్ల వినతి**- ఖిలీల్‌వాడి, అక్టోబర్ 20 : అరకొర వేతనాలతో యూనివర్సిటీల్లో పనిచేస్తున్న తమను కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ టీయూ పార్ట్‌టైం లెక్చరర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్సీ కోదండరాంనకు ఆదివారం విన్నవించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు ప్రసన్న ఆధ్వర్యంలో కలిసి తమ సమస్యలపై విన్నవించి, పరిష్కరించేందుకు కృషిచేయాలని కోరారు.
- **ఆకట్టుకున్న సర్వలహరి** - సుభాష్‌నగర్, అక్టోబర్ 20 : నగరంలో గీతాభవనంలో స్వర సౌరభం ఆధ్వర్యంలో స్వరలహరి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. సాహిత్యం, సంగీతంతో కూడుకున్న అలనాటి పాటలు మనస్సుకు ఆహ్లాదాన్ని కలిగిస్తాయని కవి వీపీ చందన్‌రావు అన్నారు. ఆయాచితం నాగరాజు శర్మ, సముద్రాల రాములు, విజయ్‌కుమార్, గిరీశ్‌బాబు, సుజాత అలనాటి పాటలను పాడి ఆకట్టుకున్నారు. గాయకులను సత్కరించారు.
- **హిందూవాహిని నూతన కార్యవర్గం ఎన్నిక** - సుభాష్‌నగర్, అక్టోబర్ 20 : హిందూవాహిని ఇందూరు నగర శాఖ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నట్లు తెలంగాణ ప్రాంత ప్రతినిధులు సురేశ్, బండి శ్రవణ్ తెలిపారు. అధ్యక్షుడిగా సనాతన శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా గజానన్, సౌమ్య, విద్యాసాగర్, అభినవ్, సహాయ కార్యదర్శులుగా శ్వేత, రణధీర్, విశ్వక్, పద్మ, శైలేశ్, సుధాకర్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు.
- **విలీన సభకు తరలిన** - శక్కర్‌నగర్, అక్టోబర్ 20: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించిన టీయూసీఐ, ఐఎఫ్‌టీయూ విలీనసభకు బోధన్ నుంచి బీడీ, భవన, మధ్యాహ్న భోజన కార్మికులతో పాటు వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు తరలివెళ్లారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు బి.మల్లేశ్, నాగమణి, ఆర్.లక్ష్మి, కళావతి, బీపాషా బేగం, రేహానా, కె. రవి, మధు తదితరులు వెళ్లారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ధర్పల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

కందకుర్తిలో సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ ఇమ్రాన్‌బేగ్

ధర్పల్లి/ జక్రాన్‌పల్లి/ సిరికొండ/ మాక్లూర్/ రెంజల్, అక్టోబర్ 20 : జిల్లాలోని పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఆదివారం ప్రారంభించారు. ధర్పలి మండలకేంద్రంలోని పసుపు కేంద్రం వద్ద ఐడీసీఎంఎస్ ఆధ్వర్యంలో, డిగ్రీ కళాశాల వద్ద సొసైటీ ఆధ్వర్యంలో, సిరికొండ మండలంలోని కొండూర్, పెద్దవాల్గోట్ గ్రామాల్లో, జక్రాన్‌పల్లి మండలంలోని సికింద్రాపూర్‌లో అర్గుల్ సొసైటీ ఆధ్వర్యంలో, బ్రాహ్మణ్‌పల్లి సొసైటీలో, కొలిప్యాక్ సొసైటీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్వింటాలు ఏ - గ్రేడ్ రకానికి రూ.2,320, బీ- గ్రేడ్‌కు రకానికి రూ.2,300 మద్దతు ధర అందజేస్తున్నట్లు తెలిపారు. సన్నం వడ్లకు ఈ సీజన్ నుంచే బోనస్ అందజేస్తామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మాక్లూర్ మండలంలోని గొట్టుముక్కుల, వల్లభాపూర్, చిక్లీ, గుంజిలి, కొత్తపల్లి, బోంకన్‌పల్లి, ముల్లంగి(బి), ధర్మోరా గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ చైర్మన్ అశోక్ ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు దయాకర్‌రావు, లక్ష్మి, మహేశ్వర్‌రావు, సీఈవో ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు. సోయా కొనుగోలు కేంద్రం.. కందకుర్తి శివారులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సోయాబీన్ కొనుగోలు కేంద్రాన్ని నీలా విండో చైర్మన్ ఇమ్రాన్‌బేగ్ ఆదివారం ప్రారంభించారు. మాజీ సర్పంచ్ ఖలీంబేగ్, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

మంజీరా చెక్‌పోస్ట్ తనిఖీ

చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న సబ్‌కలెక్టర్ వికాస్ మహతో

పొతంగల్, అక్టోబర్ 20 : మండలంలో బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతో ఆదివారం పర్యటించారు. మంజీరా బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును తనిఖీ చేశారు. ఇసుక, డబ్బులు, మద్యం అక్రమ రవాణా జరగకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని, ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని సిబ్బందికి సూచించారు.

'కేజీబీవీ ఘటనను ఖండిస్తున్నాం'

మాక్లూర్, అక్టోబర్ 20: మండల కేంద్రంలోని కేజీబీవీలో ఇటీవల ఓ ఉపాధ్యాయురాలు (సీఆర్‌టీ) తన బంగారు గొలుసు చోరీకి గురైందంటూ విద్యార్థినిని ఓ బాబా వద్దకు తీసుకెళ్లి అంజనం పేరుతో భయాందోళనకు గురి చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు కోయేడి నర్సింహులు అన్నారు. మండల కేంద్రంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాల్సిన ఉపాధ్యాయులు మంత్రాలు, చేతబడుల పేరుతో ఇలాంటి చర్యలకు పాల్పడడం సరికాదన్నారు. ఈ సంఘటనకు బాధ్యులైన వారిపై ఉన్న తాధికారులు సత్వరమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల కన్వీనర్ బోడ ప్రమోద్, కట్ట నరేశ్‌కుమార్‌నాయక్, వెంకట మల్లయ్య, శ్రీరాం పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

- **నేడు శంకుస్థాపన** - శక్కర్‌నగర్, అక్టోబర్ 20: బోధన్‌లో న్యాయమూర్తుల నివాస భవన నిర్మాణ పనులను సోమవారం ప్రారంభించనున్నట్లు బోధన్ బార్ అసోసియేషన్ ఈరడి పోశెట్టి, కార్యవర్గ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.సురేందర్, జడ్జి లక్ష్మి నారాయణ అలిశెట్టి తదితరులు ఈ కార్యక్రమాన్ని వర్చువల్ పద్ధతిలో ప్రారంభిస్తారని వివరించారు.
- **ఆర్థిక సాయం**- బాల్కొండ, అక్టోబర్ 20 : పట్టణ కేంద్రానికి చెందిన మారంపల్లి అశోక్ కుమారుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో కాలు విరగడంతో రాష్ట్ర కోఆపరేటివ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి సహకారంతో రూ.5 వేలు ఆర్థిక సాయం చేసినట్లు కాంగ్రెస్ నాయకులు ఆదివారం తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సంజీవ్‌గౌడ్, జావిద్, ప్రవీణ్ గౌడ్, ఇమ్రాన్‌ఖాన్,గంగాధర్ పాల్గొన్నారు.
- **హ్యాపీ సండే** - ఆర్మూర్‌టౌన్,అక్టోబర్20: పట్టణంలోని నవనాథ సిద్దేశ్వర పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రం సిద్దుల గుట్టపై ఆనంద ఆదివారం హ్యాపీ సండే కార్యక్రమం నిర్వహించారు. ధ్యానం చేయడంతో కలిగే లాభాలను ధ్యానదాతలు వివరించారు. ప్రతి ఒక్కరూ ధ్యానం చేయాలని సూచించారు.
- **మాజీ రాష్ట్రపతి కేఆర్ నారాయణ్‌కు నివాళి**- వేల్పూర్, అక్టోబర్ 20: రామన్నపేట్‌లో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మాజీ రాష్ట్రపతి కేఆర్.నారాయణ్ జయంతి నిర్వహించారు. ఆ సంఘం ప్రధాన కార్యదర్శి జాంభవ (చమార్), టి.గంగాధర్, టి.రాజన్న, రవి, గంగాధర్, సభ్యులు పాల్గొన్నారు.
- **పశువులకు గాలికుంటు నివారణ టీకాలు**- ఆర్మూర్‌టౌన్, అక్టోబర్20: మండలంలోని అందాపూర్‌లో ఆదివారం గోవులు, గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు మండల పశువైద్యాధికారి ప్రభాకర్ తెలిపారు. రైతులు గోవులకు, గేదెలకు టీకాలు ఇప్పించాలన్నారు.
- **ఆర్థిక సాయం** -ఆర్మూర్‌టౌన్, అక్టోబర్20: మామిడిపల్లికి చెందిన మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికురాలు వసంత ఆదివారం అనారోగ్యంతో మృతి చెందగా మృతురాలి కుటుంబాన్ని చైర్‌పర్సన్ లావణ్యా శ్రీనివాస్ పరామర్శించి రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు.
- **జీపీ కార్మికులను పర్మినెంట్ చేయాలి**- బోధన్ రూరల్, అక్టోబర్ 20: గ్రామ పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం బోధన్ మండల పరిషత్ కార్యాలయంలో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆసంఘం నాయకులు సాగర్, బాలయ్య, శంకర్, రేఖ, శరత్‌రెడ్డి, శ్రీనివాస్, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.
- **ఘనంగా మహాలక్ష్మి పండుగ**- మాక్లూర్/ ఎడపల్లి, అక్టోబర్20: మాక్లూర్ మండలం ముల్లంగి(బీ), మాదాపూర్, బోర్గాం(కె) తదితర గ్రామాల్లో మహాలక్ష్మి పండుగను నిర్వహించారు. ఏటా పంటలు చేతికి వచ్చే ముందు ఈ పండుగ నిర్వహిస్తామని గ్రామస్తులు తెలిపారు. వీడీసీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఎడపల్లితోపాటు జానకంపేట్‌లో పోచమ్మ పండుగను గ్రామస్తులు నిర్వహించారు. బోనాలతో ఊరేగింపుగా ఆలయాలకు వెళ్లి పూజలు నిర్వహించారు.



కార్యక్రమంలో ఫాదర్ ప్రభాకర్, ప్రత్యేక అతిథి దయానంద్, నర్సులు, వైద్య సిబ్బంది

చర్చిలో మెడికల్ సండే

శక్కర్‌నగర్, అక్టోబర్ 20: బోధన్ పట్టణం శక్కర్‌నగర్‌లోని సీఎస్ఐ చర్చిలో ఆదివారం మెడికల్ సండే కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రత్యేక ఆహ్వానితులుగా వచ్చిన దయానంద్ హాజరై మాట్లాడారు. అనంతరం చర్చిలో క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో చర్చి ఫాదర్ ప్రభాకర్, చర్చి కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్మూర్ పట్టణంలో నటరాజ నృత్యానికేతన్ నాట్య గురువు మృణాళినికి డాక్టరేట్ వచ్చిన సందర్భంగా ఆమెను నాట్య విద్యార్థినులు వారి తల్లిదండ్రులు ఆదివారం సన్మానించారు. వరల్డ్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ వారు న్యూ ఢిల్లీలో ఆమెకు డాక్టరేట్ ప్రదానం చేశారు.

– ఆర్మూర్‌టౌన్, అక్టోబర్20

ఎంఈవో ఎవరో?

రెంజల్, అక్టోబర్ 20: మండల విద్యాశాఖ అధికారిగా పనిచేసి గత నెలలో గణేశ్ రావు ఉద్యోగ విరమణ పొందారు. ఆయన స్థానంలో జిల్లా విద్యాశాఖ అధికారికంగా ఎవరి పేరునూ ప్రకటించలేదు. ఎంఈవో లేకపోడంతో మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. పర్యవేక్షించేవారు లేకపోవడంతో కొందరు ఉపాధ్యాయులు విధులకు డుమ్మా కొడుతున్నారని పేర్కొంటున్నారు.వెంటనే ఎంఈవోను నియమించాలని కోరుతున్నారు.

టేబుళ్ల వితరణ

నందిపేట్, అక్టోబర్ 20: బజార్‌కొత్తూర్ గ్రామంలో టైగర్ యూత్ సభ్యులు గ్రామానికి 10 సిమెంట్ టేబుళ్లను వితరణ చేశారు. ఆదివారం ఆ టేబుళ్లను గ్రామంలోని ప్రధాన కూడళ్ల వద్ద ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేశారు. వీటిని రూ.25 వేల ఖర్చు చేసి టైగర్ యూత్ సభ్యులు అందజేశారు. యూత్ సభ్యులు లక్ష్మీనారాయణ, రాంబాబు, మల్లయ్య, సంతోష్, గంగాధర్ పాల్గొన్నారు.

హామీల అమలేదీ?

నవీపేట, అక్టోబర్ 20: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లపు వెంకటేశ్ విమర్శించారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన ఆపార్టీ మండల మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పేదల జన్‌ధన్ ఖాతాలో రూ. 15 లక్షలు జమ చేస్తామన్న పీఎం మోదీ మాటలు ఏమయ్యాయని ఎద్దేవా చేశారు. నిరుద్యోగులకు ఉద్యోగాలను ఇస్తామని చెప్పి పట్టించుకోడం లేదని మండి పడ్డారు. రాష్ట్రంలో ఆరు గ్యారెంటీల పేరిట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు నాయక్‌వాడ్ శ్రీనివాస్, దే